క్లుప్తంగా

'ఇచ్చిన మాటకు కట్టుబడిన కాంగ్రెస్'

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చి మాటకు కట్టుబడి ఉందని నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు అశ్విన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం జూలై లోపే రూ. లక్షన్నర వరకు రుణమాఫీ చేసిందన్నారు. గత వారం రోజుల క్రితం రూ. లక్ష రుణమాఫీ చేయగా.. సోమవారం రెండవిడత రుణమాఫీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపుల శివకుమార్, తదితరులు ఉన్నారు.

కుక్కల నుంచి రక్షణ కల్పించండి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలో కుక్కల బెడదతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని కాలనీవాసులు మచ్చ వెంకటేశ్, రాజేశ్వర్‌లు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ.. చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తుందన్నారు. కాలనీకి సమీపంలో ఉన్న కస్తూరిబా పాఠశాల ఎదుట నూతనంగా నిర్మించి వదిలేసిన ఆరోగ్య ఉప కేంద్రంలో కుక్కట్లు ఉంటున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు కాలనీ వాసులను కుక్కల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

యువతి పెళ్లికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన సీపతి భవానికి పెళ్లి కురదడంతో ఆమె పెళ్లి ఖర్చుల నిమిత్తం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తన వంతుగా రూ. 20 వేల ఆర్థిక సాయం అందించాడు. సోమవారం ఎమ్మెల్యే అనుచరులు ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. దీంతో భవాని బంధువులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



శంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల కేంద్రంలోని హనుమాన్‌వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రావుల శంకర్ పదోన్నతిపై ధన్నూర్(బి) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా బదిలీ అయ్యాడు. సోమవారం మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సురేశ్ వైద్య, ఆర్‌టీపీ ప్రసాద్, శ్రీనివాస్ రెడిడ విజయ్‌కుమార్, ఈదపు పోశెట్టి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ వెంకటేశ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సుర్జాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించాలని కోరారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత

దహెగాం: పులుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఎస్‌వోలు రవికుమార్, బాపు అన్నారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గెర్రె, గిరవెల్లి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. వన్య ప్రాణులను వేటాడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం నుంచి అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్ఆర్‌వో రమాదే వి, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: వన్యప్రాణులను, అడవులను సంరక్షించడంతోనే మానవ మనుగడ, జీవన పరిస్థితులు మెరుగుపడుతాయని ఎఫ్ఆర్‌వో జ్ఞానేశ్వర్, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. రోజురోజుకు అడవులు అంతరించిపోతున్నాయన్నారు.

పత్తిలో కలుపు కష్టాలు

- వివరీతంగా పెరిగిన గడ్డి
- వర్షాలతో వ్యవసాయ పనులకు ఆటంకం
- ఆందోళనలో రైతులు



హస్నాపూర్ శివారులో పత్తిలో పెరిగిన కలుపు

తాంసి: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంట ఎదిగే సమయంలో కలుపు మొక్కలు రైతులను ఇబ్బంది పెడుతోంది. వర్షం ఏకధాటిగా పడుతుండడంతో కలుపుతీత పనులు కొనసాగించే అవకాశం లేదు. పత్తి గడ్డి రోజురోజుకూ పెరుగుతోంది. వరుస వర్షాలతో కూలీలు కూడా దొరకని పరిస్థితి. దీనికి తోడు పంటచేలలో వర్షపునీరు నిలిచి మొక్కలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి.

ప్రధాన పంటగా పత్తి..

తాంసి, భీంపూర్ మండలాల్లో ప్రధానంగా పత్తి సాగు చేస్తున్నారు. పత్తితో పాటు కంది, సోయా సాగు చేస్తారు. తాంసి మండలంలో 14 వేల ఎకరాలు, భీంపూర్ మండలంలో 18 వేల ఎకరాల పత్తి సాగవుతోంది. రైతులు సాగు చేసిన పత్తి అక్టోబర్‌లో దిగుబడి ప్రారంభం అవుతుంది. చేతికొచ్చే వరకు నాలుగు నెలలు రైతులు పంటను కాపాడుకోవాల్సి ఉంటుంది. పత్తి సాగుకు ఒక ఎకరానికి పెట్టుబడి కోసం రైతులు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు పెడుతారు. ప్రస్తుతం సాగు చేసిన పత్తి దాదాపుగా 45 రోజుల మాత్రమే అవుతుంది. గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో విపరీతంగా కలుపు పెరిగింది. దీంతో పత్తి మొక్కలు ఎదగడం లేదు. ఎకరానికి 20 మందికి పైగా కూలీలు అవసరమవుతారు. కూలీలకు రోజుకు రూ.300 చొప్పున కూలీ డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. రైతులకు ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా ఖర్చు అవుతుంది.

రానున్న రోజుల్లో తెగుళ్ల సోకే అవకాశం..

ఇప్పుడే ఇలా ఉంటే పూత, కాత దశలో మరింత తెగుళ్ల సోకితే ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. కాగా మండలంలో అధికశాతం నల్లరేగడి భూములు కావడంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటచేలలో తేమ, వర్షపునీరు వారం రోజుల వరకు ఆరే పరిస్థితి లేదు. లోతట్టు పంట చేలలో నీరు నిలిచి పంట పంట సైతం దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలుపు పెరుగుతుంది



పది రోజులుకు పైగా వర్షం కురుస్తుంది. ప్రతీ రోజు వర్షం కురవడంతో పంటచేలో పనులు చేసుకోలేని పరిస్థితి. తేమశాతం ఉండి బురదగా ఉండటంతో అరకతో పనులు సాగడం లేదు. పత్తి, సోయాలో కలుపు విపరీతంగా పెరిగింది. – చిల్కూరి చిన్న రాంరెడ్డి, రైతు

జాగ్రత్తలు పాటించాలి

రైతులు పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలి. వరుస వర్షాలతో కలుపు తీసే అవకాశం లేక మొక్కలు ఏపుగా పెరిగాయి. మందులు పిచికారి చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సాగులో సమస్యలుంటే ఏఈవోలను సంప్రదించాలి. – రవీందర్, ఏవో, తాంసి

వాగుదాటే ప్రయత్నం చేయవద్దు



కన్నాపూర్ వాగు వద్ద తాళ్లు కడుతున్న పోలీసులు

ఇంద్రవెల్లి: మారుముల గ్రామీణ ప్రాంత ప్రజలు ఉధృతంగా ప్రవహించే వాగు దాటే ప్రయత్నం చేయవద్దని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. సోమవారం డీడీఆర్ఎఫ్ పోలీసు బృందంతో కలిసి సిరికొండ మండలంలోని కన్నాపూర్ గ్రామం వాగు వద్ద తాళ్లు కటి ఇంద్రవెల్లి మండలంలోని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా.. అధికారులకు, పోలీసు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిరికొండ మాజీ జెడ్పీటీసీ కుమ్ర రఘురాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని దాబా (కె)లో సోమవారం జగదంబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి నూతనంగా ఏర్పాటు చేయనున్న కలషానికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ గోపురానికి కలషం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిరిచెల్మలో మల్లన్న ఆలయంలో

ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మలో మల్లన్న ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చెరువు మధ్యలో ఉన్న ఆలయానికి నీటిలో నుంచి నడుచుకుంటూ.. వెళ్లి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సోమవారం మల్లన్న ఆలయానికి భక్తుల తాకిడి ఉంటుందని ఆలయ పూజరి తుప్తి మహేశ్ తెలిపారు. శ్రావణ సోమవారం సందర్భంగా ప్రతీ సోమ, శనివారల్లో భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు.

'గిరి' ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేయాలి

ఆదిలాబాద్: గిరిజన సంక్షేమశాఖలో విధులు నిర్వర్తిస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులను ఎలాంటి న్యాయచిక్కులు లేకుండా అప్‌గ్రేడ్ చేయాలని ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గత సంవత్సర కాలం నుంచి రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా వన్‌వే

- తాత్కాలిక డివైడర్ లేకుండానే వాహనాల రాకపోకలు



వన్‌వేలో వస్తున్న వాహనాలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని దుబార్‌పేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వన్‌వే ప్రమాదకరంగా కొనసాగుతోంది. దుబార్‌పేట్ సమీపంలో 44 వ జాతీయ రహదారిపై దుబార్‌పేట్ వైపు అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దీంతో మండల కేంద్రం వైపు ఉన్న రోడ్డును వన్‌వేగా మార్చారు. దాదాపుగా కిలో మీటర్ పొడువున వాహనాలు వన్‌వేలోనే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా.. కాంట్రాక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏర్పాటు చేసిన టాకీలకు కనీసం రేడియం స్టిక్కర్లు అతికించడం లేదు. జాతీయ రహదారి గుండా ప్రతీనిత్యం వేల వాహనాలు తిరుగుతుంటాయి. హైవేకు ఏర్పాటు చేసిన వన్‌వే డైవర్షన్ వద్ద సైతం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. నేషనల్ హైవే అథార్టీ అధికారుల సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతీ రోజు దినం రాత్రిలో వేల వాహనాలు ప్రయాణించే రహదారిలో కనీస జాగ్రత్తలు పాటించడంలేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాణేల ప్రదర్శన



నాణేలు ప్రదర్శిస్తున్న రాజ్‌కుమార్

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో సొనాల గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ విద్యార్థులకు సోమవారం వివిధ పురాతన నాణేల గురించి వివరించారు. రాజుల కాలంలో చెలామణిలో ఉన్న నాణేలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

శునకాల స్వైర విహారం



బోథ్: మండల కేంద్రంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గ్రామంలో పదుల సంఖ్యలో కుక్కలు పలువురిని కరిచాయి. ఇటీవల బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తున్న ప్రయాణికుడిని కరిచింది. అధికారులు స్పందించి శునకాల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు



తాంసి: బురదయమంగా పిప్పల్‌కోటి రోడ్డు



కైలాస్‌నగర్: గుంతలమయంగా రోడ్డు

కై లాస్‌నగర్/తాంసి: ఇటీవల కురిసిన వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంతర్గత రహదారులు అధానంగా మారాయి. ముఖ్యంగా దస్నాపూర్ నుంచి పిట్టలవాడ కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈరోడ్డుపై నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి దుస్థితి నెలకొన్నప్పటికీ సంబంధిత వార్డు కౌన్సిలర్, బల్దియా అధికారులు దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో కొత్తగా ఏర్పడిన కాలనీ రోడ్లు పూర్తిగా బురదమయంగా మారాయి. బురదరోడ్డుపై నడిచి వెళ్లలేని దుస్థితి. అధికారులు, పంచాయతీ కార్యదర్శి స్పందించి రోడ్డు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ఎమ్మెల్యేపై దుష్ప్రచారం సరికాదు'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ఎస్సీ సామాజికవర్గానికి రిజర్వ్ అయిన ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక విషయంలో స్థానిక ఎమ్మెల్యేపై కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలోని అర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసేవారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే సూచనమేరకే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆశావహులు మార్కెట్ చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అందరితో చర్చించాకే అమోదయోగ్య విధంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఎమ్మెల్యే ప్రకటించారని తెలిపారు. ఖానాపూర్‌కు చెందిన పార్టీ సీనియర్లకే ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మ్యాదరి రాజేశ్వర్, రాసమల్ల అశోక్, మైస శ్రీనివాస్, పంబాల రాజన్న పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్తాచెదారం



పాఠశాల ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని డీఈవో కార్యాలయ సమీపంలో గల ప్రభుత్వ పాఠశాల నం.2 ఎదుట పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పోలీసు పాత క్వార్టర్స్ వద్ద చెత్తాచెదారంతో దర్శనమిస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే కొంత మంది ఇక్కడే మలమూత్ర విసర్జన చేయడంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దోమలు, ఈగలు వాలుతుండడంతో పక్కన ఉన్న పాఠశాల విద్యార్థులతో పాటు డీఈవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నత్తనడకన రోడ్డు పనులు



లాండసాంగ్వీ గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వరదనీరు

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించారు. అయినా.. అప్పటి పాలకుల నుంచి స్పందన లభించలేదు. గత ఏడాది వర్షాకాలంలో జైనథ్ మండలం తరడో గ్రామ సమీపంలోని వంతెన కుంగిపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామం మీదుగా వెళ్లే రోడ్డుకు మోక్షం లభించింది. ఆదిలాబాద్ నుంచి లాండసాంగ్వి గ్రామం మీదుగా నిరాల వరకు సుమారు 15 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిరాల నుంచి లాండసాంగ్వి గ్రామం మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్లే మార్గంలో సగం వరకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగితా పనుల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వర్షాకాలం కావడంతో రోడ్డు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు మొరాయించడంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అటువైపు నుంచి వెళ్లే ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మిగిలిన రోడ్డు నిర్మాణ పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

రెబ్బెన: మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో షీటీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై హింసా, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఫొటోలు, వీడియోలను పోస్ట్‌చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. షీ టీం సభ్యులు సునీత పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'

ఉట్నూర్‌రూరల్: గత ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, ఐకేపీ సిబ్బందికి రూ. 26 వేల రూపాయల కనీస వేతనం అందించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు శ్రీనివాస్, ప్రవాంత్, దాసు, దుబ్బన్న, అమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కు విశిష్ట ఉపాధ్యాయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చిలుక సతీష్

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న చిలుక సతీష్ జిల్లాస్థాయి విశిష్ట ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గురువందనం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.